క్లుప్తంగా

ఉత్సాహంగా సాగుతున్న ఆటల పోటీలు



తెనాలిఅర్బన్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా తెనాలి పట్టణంలో నిర్వహిస్తున్న కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్ పోటీలు శుక్రవారం ఉత్కంఠబరితంగా సాగాయి. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటూ అత్యుత్తమ ప్రదర్శన కొనసాగిస్తున్నారు. పట్టణంలోని 20 క్రీడా మైదానాల్లో వివిధ రకాల పోటీలు జరిగాయి. పీడీలు న్యాయనిర్ణేతలుగా వ్యవహించారు.

యోగాతో మానసిక వికాసం

తెనాలిఅర్బన్: నేటి యాంత్రిక జీవితంలో ఒత్తిడిని అధిగమించటంతో పాటు మానసిక వికాసం పొందేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుందని హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ శిక్షకులు ఎంఆర్‌కే మూర్తి, టి.సుబ్బారావులు పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన యోగా వర్క్‌షాపు శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా ప్రతిరోజు చేయడం వలన మానసిక ఉల్లాసం, ఏకగ్రత వంటివి అలవడతాయని చెప్పారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ టి.జ్యోతిబస్, కె.కల్యాణ్ చక్రవర్తి, ఫణికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం



పాత గుంటూరు: సంపత్ నగర్ శ్రీ రామనామ క్షేత్రంలో 97వ శ్రీ రామకోటి మహోత్సవం, వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. క్షేత్రం గౌరవ అధ్యక్షులు పోలిశెట్టి హరిప్రసాద్, ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు క్రోసూరి మురళీ కృష్ణమాచార్యులు వరపూజ చేసి, మేళతాళాలతో ఉత్సవమూర్తుల్ని కల్యాణ వేదికకు చేర్చారు. విష్వక్సేనారాధనతో ప్రారంభించి మాంగల్య పూజ అనంతరం మంగళసూత్ర ధారణ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్న ప్రసాద వితరణ చేశారు. శ్రీ రామదాసు కీర్తనల్ని చింతలపాటి రామమహేశ్వరి, ఇమ్మడి అంజనీదేవి ఆలపించారు. సాయంత్రం పోటీల్లో పాల్గొన్న బాలబాలికలకు బసవరాజు జయశంకర్ బహుమతులు ప్రదానం చేశారు. గరుడ వాహనంపై సీతారాముల కల్యాణమూర్తుల నగరోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. లీలాసుందరి మాట్లాడుతూ శనివారం ఉదయం సహస్ర నాగవల్లీ దళార్చన, సాయంత్రం నగరోత్సవం ఉంటాయని తెలిపారు. కార్యక్రమాల్ని కె. రామచంద్ర ప్రభు, కె.శాంతి భూషణ్, డాక్టర్ వి. రాఘవరావు పర్యవేక్షించారు.

హిందూ కళాశాలలో స్మారక ప్రతిభా పురస్కారోత్సవం



గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో శుక్రవారం బద్దెపూడి ముకుందరావు స్మారక ప్రతిభా పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వాణిజ్య విభాగ ఆధ్వర్యంలో పాఠ్యాంశాలతో పాటు సాంస్కృతిక పరమైన అంశాల్లో విద్యార్థులకు పోటీల్ని నిర్వహించారు. విజేతలతో పాటు చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని షేక్ అఫ్రీన్‌బానుకు రూ.ఐదువేల నగదు బహుమతిని బద్దెపూడి ముకుందరావు కుటుంబ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి.లక్ష్మీ బద్రీనాథ్, డాక్టర్ బి. లీలామోహన్, రాజీవ్, దత్తప్రసాద్, సోమశేఖర్, టి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.ఎస్. దుర్గాప్రసాద్, కామర్స్ ఇన్‌చార్జ్ ఐ. శాంతిలత పాల్గొన్నారు.

జనవరి 12,13 తేదీల్లో ఎస్టీయూ వజ్రోత్సవాలు

పెదకాకాని: ఎందరో త్యాగధనుల పోరాట చరిత్ర రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) సొంతమని గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కె. సుబ్బారెడ్డి పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో జనవరి 12,13 తేదీల్లో నిర్వహించనున్న ఎస్టీయూ వజ్రోత్సవాల వాల్ పోస్టర్లు, కరపత్రాల్ని పెదకాకాని విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ సంఘ చరిత్రను ద్విగుణీకృతం చేసేలా జిల్లా నలుమూలల నుంచి విరివిగా నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కె. కృష్ణ, గౌరవాధ్యక్షులు ఎం. దేవపాల్, ఆర్థిక కార్యదర్శి ఆర్.వి. లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు సీహెచ్. వెంకటేశ్వర రెడ్డి, డి.రామకృష్ణ, జిల్లా కౌన్సిలర్లు పి. శ్రీనివాసరావు, జె. విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మేం అధికారంలోకి వస్తాం...మిమ్మల్ని పీకేస్తాం..

మున్సిపల్ ఉద్యోగిపై టీడీపీ కౌన్సిలర్ త్రిమూర్తి దౌర్జన్యం



వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లపై దౌర్జన్యం చేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

తెనాలిఅర్బన్: 100 రోజుల్లో మేము అధికారంలోకి వస్తున్నాం....మిమల్ని పీకేస్తాం అంటూ అజెండా చదువుతున్న మున్సిపల్ ఉద్యోగి వెంకటేశ్వరరావుపై టీడీపీ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి దౌర్జన్యానికి దిగారు. అంతేకాక సదరు ఉద్యోగి ఉన్న చోటుకు వచ్చి ఆగ్రహంతో ఊగిపోయారు. దీనిని గమనించిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌లు వెంటనే అక్కడికి వచ్చి ఉద్యోగికి అండగా నిలవడంతో పాటు టీడీపీ కౌన్సిలర్‌ను అడ్డుకున్నారు. దీంతో వైఎస్సార్ సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశానికి శుక్రవారం కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభం కాగానే అజెండాలోని 11వ అంశం చదవటం పూర్తి కాగానే టీడీపీ కౌన్సిలర్ అన్నం పిన్నారావు లేచి వైఎస్సార్ కళాశాల ఎదురు గ్రీనరీ ఏర్పాటుకు రూ.40 లక్షలు ఎందుకు కేటాయిస్తున్నారని, ఆ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. తెనాలి ప్రాంతానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చిన వారి విగ్రహాలు అక్కడ ఏర్పాటు చేయడంతో పాటు ఆ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లు షేక్ దుబాయ్‌బాబు, మొఘల్ అహ్మద్ బేగ్‌లు వివరించారు. అభివృద్ధి పనులు చేస్తున్నా ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ఇంతలో టీడీపీ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి లేచి విగ్రహాలకు అనుమతి ఉంటే తమకు చూపాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా మార్కెట్ వద్ద ఎన్‌టీఆర్ విగ్రహాన్ని టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఇలాంటి సంస్కృతికి గతంలోని మీ ప్రభుత్వమే తెరతీసిందంటూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య ఆరోపించారు. దీంతో కొద్దిసేపు వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్‌ల మధ్య వాదోపవాదాలు జరిగాయి. చైర్‌పర్సన్ కలుగజేసుకోవటంతో వివాదం సర్దుమణిగింది. వెంటనే టీడీపీ కౌన్సిలర్‌లు అంశంపై డీసెంట్ ఇచ్చారు. అజెండాలోని 14వ అంశం చదవటం పూర్తి కాగానే టీడీపీ కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు లేచి రణరంగ చౌక్ స్థలం 10 గజాలు కూడా ఉండదని, దాని అభివృద్ధికి రూ.25లక్షలు ఎందుకు వెచ్చించారని ప్రశ్నించారు. ఎందరో మహానుభావులు అశువులు బాసిన ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తుంటే ఎందుకు ఇలా ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లు దుబాయ్‌బాబు, మొఘల్ అహ్మద్ బేగ్‌లు ప్రశ్నించారు. ఇంతలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి లేచి 30వ వార్డులోని ఒక సెంట్ స్థలంలో కమ్యునిటీ హాల్ నిర్మాణం కోసం గత టీడీపీ ప్రభుత్వం రూ.1.20 కోట్లు ఖర్చు చేసిందని, దానిపై మొదటి అంతస్తు కేవలం రూ.18 లక్షలతో తమ ప్రభుత్వం నిర్మించిందని, నిధులు దోచుకోవటం టీడీపీకి అలవాటని ఆరోపించారు. దీంతో టీడీపీ కౌన్సిలర్‌లు లేచి అరుస్తుండటంతో గందరగోళంగా సమావేశం మారింది. చైర్‌పర్సన్ అజెండా చదవాలని సూచించటంతో మున్సిపల్ ఉద్యోగి వెంకటేశ్వరరావు దానిని చదువుతుండగా టీడీపీ కౌన్సిలర్‌లు పోడియం వద్దకు వచ్చి ఉద్యోగిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 100 రోజుల్లో మేము అధికారంలోకి వస్తామని, రాగానే మీమల్ని పీకేస్తాం అంటూ దౌర్జన్యానికి దిగారు. దీంతో టీడీపీ, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌ల మధ్య కొద్దిసేపు స్వల్ప తోపులాట జరిగింది. సమావేశాన్ని చైర్‌పర్సన్ రాధిక వాయిదా వేసి వెళ్ళిపోయారు. అనంతరం సమావేశాన్ని ప్రారంభించగానే అజెండాలోని మిగిలిన అంశాలు చదవి అమోదించారు. 14వ అంశంపై టీడీపీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్ డీసెంట్ అందజేశారు.

ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సచివాలయంకు రూ.20లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, వాటిని ఉపయోగించటంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌లు తాడిబోయిన రామయ్య, పేరం సంజీవరెడ్డి, షేక్ ఇస్మాయేల్, దాసరి వసంతరావులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ నిధులు విడుదల చేసినా అధికారులు మాత్రం నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని విమర్శించారు. పనులు చేయబోయే ప్రాంతాన్ని సందర్శించకుండా సచివాలయ ఉద్యోగులతో అంచనాలు రూపొందించి వాటినే అజెండాలో పెట్టి ఆమోదిస్తున్నారని తెలిపారు. ఏఈ రాజుపై ఆగ్రహం వ్యక్తం చేసిన చైర్‌పర్సన్ రాధిక ఇంజినీరింగ్ అధికారులు పద్ధతి మార్చుకోవాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం బడ్జెట్ ను చదవి దానిని ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, కమిషనర్ ఎం జశ్వంతరావు, ఎంఈ నాగమల్లేశ్వరరావు, కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్థులకు పౌష్టికాహారం పంపిణీ

తెనాలి అర్బన్: జిల్లా క్షయ నివారణ అధికారుల సూచన మేరకు పాత ప్రభుత్వ వైద్యశాలలో టీబీ యూనిట్‌లో చికిత్స పొందుతున్న 27 మంది క్షయ వ్యాధిగ్రస్థులకు శుక్రవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. గుంటూరుకు చెందిన ఐటీసీ, నాట్కో సంస్థల సహకారంతో వీటిని పంపిణీ చేస్తున్నట్లు సూపర్‌వైజర్ పి.రవికుమార్ చెప్పారు. కార్యక్రమంలో బ్రహ్మారెడ్డి, లక్ష్మీ భార్గవి, దిలీప్, పావని, వనజ, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

నూతక్కి గ్రంథాలయానికి స్టడీ మెటీరియల్

తాడేపల్లిరూరల్: నూతక్కి శాఖా గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించనున్న పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం గ్రూప్-1,2 పరీక్షలకు సంబంధించి స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉందని గ్రంథపాలకుడు ఎస్. నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ, గుంటూరు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశాల మేరకు స్టడీమెటీరియల్స్ అందజేశారని చెప్పారు. పుస్తకాలలో హైటెక్ విజయ రహస్యం, జనరల్ నాలెడ్జి, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఏపీపీఎస్సీ, గ్రూప్ -1 పేపర్లు, ఎస్ఎస్ఓ మ్యాథ్స్, భారత రాజకీయ వ్యవస్థ, మ్యాథ్స్, అర్థమెటిక్స్, ఆర్ఆర్‌బీ నాన్ టెక్నికల్, జనరల్ సైన్స్, వెర్బల్ మరియు నాన్ వెర్బల్, రీనజింగ్ బుక్స్ మొదలైనవి అందుబాటులో ఉన్నాయని, పరీక్షలకు హాజరయ్యే వారు, యువత వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

విద్యావ్యవస్థలో డిజిటల్ విప్లవానికి నాంది

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

తూములూరు(కొల్లిపర): కార్పోరేటు పాఠశాలలకు దీటుగా ప్రతి పేదవాడికి నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో విద్యా వ్యవస్థలో డిజిటల్ విద్యకు నాంది పలికిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తూములూరు గ్రామంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్నారు. దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి తో కలిసి 79 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులకు వారి మేనమామలా నిలబడి పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం వంటివి కూడా అందిస్తున్నారన్నారు. మారుతున్న కాలానుగుణంగా టెక్నాలజీ విద్య కూడా అందించటం జరుగుతుందన్నారు. ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు అందజేసిన ఒక్కో ట్యాబ్ ఖరీదు రూ.16,500 తోపాటు బైజూస్ కంటెంట్ చేర్చేందుకు మరో రూ.15,500 ను ప్రభుత్వం ఖర్చుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను అందిపుచ్చుకొని ట్యాబ్‌లను చదువు కొరకు మాత్రమే ఉపయోగించుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. మంచి మార్కులు సాధించి ప్రభుత్వానికి, వారి కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఝాన్సీలత, దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచ్ బాణవత్ అరుణాబాయ్, సొసైటీ అధ్యక్షులు ఈమని హరికోటిరెడ్డి, పాలకేంద్రం అధ్యక్షులు ఉయ్యూరు ఉమామహేశ్వరరెడ్డి, ఈద హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు అవుతు బసవపున్నారెడ్డి, మర్రెడ్డి మాధవి, పార్టీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, పార్టీనాయకులు కొల్లి రాఘవరెడ్డి, అడపా నారాయణరెడ్డి, ఎ.శివారెడ్డి, బద్దిగం శ్రీనివాసరెడ్డి, బేతాల భూషణం, మర్రెడ్డి సాంబిరెడ్డి, ఎంపీడీఓ వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నీట్ ర్యాంకర్‌కు రూ.లక్ష నగదు అందజేత



విద్యార్థికి నగదు, జ్ఞాపిక అందజేస్తున్న సభ్యులు

తెనాలి: పట్టణానికి చెందిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, డాక్టర్ లక్ష్మీప్రసాద్, సందీప్‌లు 'ప్రతిభకు పురస్కారం-ప్రతిభకు చేయూత' పేరుతో డాక్టర్ గోగినేని హరిప్రసాద్‌రావు స్మారక పురస్కారాన్ని శుక్రవారం అందజేశారు. జాతీయ స్థాయిలో నీట్ పరీక్షలో 479 ర్యాంకు సాధించిన బాపట్ల జిల్లా పోవెనవారిపాలెం యువకుడు రూపేష్‌కుమార్‌కు రూ.లక్ష నగదు, జ్ఞాపికను బహూకరించారు. ముఖ్య అతిథిగా హాజరైన సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ చేతులమీదుగా నగదును రూపేష్‌కుమార్‌కు అందజేశారు. వీవీఐటీలో ఇంజినీరింగ్ చదువుతున్న గిరి గాయత్రికి రూ.19 వేల ఆర్థికసాయం అందించారు. డాక్టర్ హరిప్రసాద్ మనుమడు సందీప్ పేదవిద్యార్థులు పెద్ద చదువులు చదువుకోవటానికి తన తాత పేరిట ఆర్థికంగా సాయపడటాన్ని అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థి తండ్రి శ్రీనివాసరావు, గోవాడ గోపీచంద్, గోగినేని బుల్లిప్రసాద్, గుమ్మడి రమేష్, గుమ్మడి సాంబశివరావు, సీహెచ్ వెంకటరత్నం, నేలటూరి బెన్ను, కొడాలి ఆదిలక్ష్మి, శ్రీనివాసరావు, రాజశేఖరరెడ్డి, షేక్ సుభాని, వేజెండ్ల శ్రీలక్ష్మి, డి.రమాదేవి పాల్గొన్నారు.

కుటుంబ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే

తూములూరు(కొల్లిపర): రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తూములూరు గ్రామంలో నూతనంగా రూ.25లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ గ్రామీణ ఆరోగ్య చికిత్సాకేంద్రం(హెల్త్ వెల్‌నెస్ సెంటర్)ను శుక్రవారం ఎమ్మెల్యే శివకుమార్, దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. ప్రతి గది నిర్మాణాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాల కోసం ప్రతి గ్రామంలో సుమారు రూ.80 లక్షలతో నాడు-నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేయటం, మౌలిక వసతులు ఏర్పాటు చేయటం, గ్రామ సచివాయం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ప్రజలకు అతిదగ్గరలో మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రతి సచివాలయం పరిధిలో ఒక హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసి వైద్యులను నియమించి వైద్యం అందిచటం జరుగుతుందన్నారు. మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలో రూ.8.5కోట్లతో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులు పూర్తి అయినట్లు వెల్లడించారు. త్వరలోనే ఈ భవనాన్ని ప్రారంభించి వైద్యశాలలో పూర్తి స్థాయి వైద్యులతో ప్రజలకు అన్ని వైద్య సేవలు అందిచనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా 300 పై చిలుకు వ్యాధులకు రూ.25లక్షల ఖరీదు వరకు ఉచిత వైద్యం చేయించుకోవచ్చని అన్నారు.అనంతరం ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులను అందించి, సచివాలయంలో దేశ నాయకులు, స్వాతంత్ర సమరయోధుల నూతన చిత్రపటాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచ్ బాణవత్ అరుణాబాయ్, సొసైటీ అధ్యక్షులు ఈమని హరికోటిరెడ్డి, పాలకేంద్రం అధ్యక్షులు ఉయ్యూరు ఉమామహేశ్వరరెడ్డి, ఈద హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు అవుతు బసవపున్నారెడ్డి, మర్రెడ్డి మాధవి, పార్టీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, పార్టీనాయకులు కొల్లి రాఘవరెడ్డి, అడపా నారాయణరెడ్డి, ఎ.శివారెడ్డి, బద్దిగం శ్రీనివాసరెడ్డి, బేతాల భూషణం, మర్రెడ్డి సాంబిరెడ్డి, అవుతు నగేష్‌రెడ్డి, ఆరిగ చంద్రారెడ్డి, కళ్ళం వెంకటప్పారెడ్డి, నెర్లకుటుంబరెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, రామిరెడ్డి, మోర్ల శ్రీను ఎంపీడీఓ వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాటకరంగానికి శ్రీరామమూర్తి సేవలు ఎనలేనివి



నివాళులర్పిస్తున్న సంఘం ప్రతినిధులు

తెనాలి: నంది నాటకోత్సవాల్లో ప్రప్రథమంగా తెనాలికి నంది బహుమతిని తీసుకొచ్చిన నటుడు రావినూతల శ్రీరామమూర్తి బహుముఖ ప్రజ్ఞాశాలి అని పలువురు వక్తలు నివాళులర్పించారు. రూరల్ మండలం అంగలకుదురుకు చెందిన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి, కవి, రచయిత, నటుడు రావినూతల శ్రీరామమూర్తి ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన విషయం విదితమే. ఈ సందర్భంగా పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో బీసీ కాలనీలోని సంఘ భవనంలో శుక్రవారం శ్రీరామమూర్తి సంస్మరణ సభను నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు అధ్యక్షత వహించారు. అభ్యుదయ కళాసమితి అధ్యక్షుడిగా, సుప్రసిద్ధ సినీ దర్శకుడు కె.విశ్వనాథ్ దగ్గర సహాయకుడిగా పనిచేసిన శ్రీరామమూర్తి ఆకస్మిక మరణం జీర్ణించుకోలేనిదని పలువురు కళాకారులు విచారం వ్యక్తంచేశారు. అభ్యుదయ కళాసమితి వ్యవస్థాపకుడు బొల్లిముంత కృష్ణ, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి, కన్నెగంటి మధు, ఆర్అండ్‌బీ రాజు, దేవిశెట్టి కృష్ణారావు, పినపాటి సురేష్ బాబు, చిట్టూరి సీతారామయ్య, కొండముది రమేష్, కనపర్తి మధు, ఎం.అంబదాసు, వేము రామరాజు పాల్గొన్నారు. తొలుత శ్రీరామమూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

మాదక ద్రవ్యం కేసులో విచారణ పూర్తి

నగరంపాలెం: 'మాదక ద్రవ్యం' కేసులో వచ్చిన ఆరోపణల దృష్ట్యా త్వరలో వేటుపడనుంది. ఇప్పటికే ఎస్ఐ, కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపించగా, సదరు పోలీస్ అధికారిని జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీఓ)లో రిపోర్ట్ చేయాలని ఆదేశించిన విషయం విదితమే.. వివరాలు.. తూర్పు సబ్ డివిజన్‌లోని ఓ పోలీస్ స్టేషన్ (పీఎస్) పరిధిలో రెండు వారాల క్రితం ఎండీఎం డ్రగ్‌తో ఉన్న ఓ కుర్రాడ్ని ఎస్ఈబీ (సెబ్) పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం అతడిని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. దీంతో అతన్ని ఫోన్ కాల్ డేటా ఆధారంగా చేసుకుని పలువురిని విచారించారు. ఈ విచారణలో సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో స్టేషన్ అధికారిని జిల్లా పోలీస్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని, ఎస్ఐ, కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపించారు. దీంతో సదరు పోలీస్ అధికారితోపాటు పలువురిపై విచారణకు గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఆదేశించారు. ఈ క్రమంలో ఏఎస్పీ(ఎల్/ఓ) శ్రీనివాసరావుతో పాటు పోలీస్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. అయితే విచారణ పూర్తికావడంతో నివేదికను జిల్లా పోలీస్ అధికారికి నివేదిక (రిపోర్ట్)ను అందజేసినట్లు సమాచారం.

గ్రామీణ క్రీడాకారులకు ప్రభుత్వం చేయూత

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

తూములూరు(కొల్లిపర): గ్రామీణ క్రీడాకారులు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఉపయోగించుకొని అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని తూములూరు గ్రామంలో జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా నాలుగో రోజు వాలీబాల్ పోటీలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి తో కలసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ క్రీడా కారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికే సీఎం జగనన్న ఆడుదాం ఆంధ్రా పోటీలకు శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రం బాగుండాలంటే నేటి బాలల చేతిలో ఉందని భావించి విద్య, క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకొని నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రభుత్వం మండల, జిల్లా , రాష్ట్ర స్థాయిలల్లో ప్రోత్సాహం క్రింద సుమారు రూ.100కోట్లు కేటాయించటం జరిగిందన్నారు. పోటీల్లో క్రీడాకారులపై ఎటువంటి ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వమే పోటీలకు కావాల్సిన మౌలిక వసతులు, ఆటలకు కావాలల్సిన వస్తువులు సమకూర్చటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచ్ బాణవత్ అరుణాబాయ్, సొసైటీ అధ్యక్షులు ఈమని హరికోటిరెడ్డి, పాలకేంద్రం అధ్యక్షులు ఉయ్యూరు ఉమామహేశ్వరరెడ్డి, ఈద హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు అవుతు బసవపున్నారెడ్డి, మర్రెడ్డి మాధవి, పార్టీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, పార్టీనాయకులు కొల్లి రాఘవరెడ్డి, అడపా నారాయణరెడ్డి, ఎ.శివారెడ్డి, బద్దిగం శ్రీనివాసరెడ్డి, బేతాల భూషణం, మర్రెడ్డి సాంబిరెడ్డి, ఎంపీడీఓ వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ బీసీ సంక్షేమ సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆనంద్‌బాబు

దుగ్గిరాల(తాడేపల్లిరూరల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం దుగ్గిరాల మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శృంగారపురం గ్రామానికి చెందిన ఉప్పాల ఆనంద్‌బాబు నియమితులయ్యారు. శుక్రవారం నియామక పత్రాన్ని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘాన్ని విస్తృతంగా బలోపేతం చేసేందుకు కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ కాగితాల స్వామి గౌడ్, మహిళా విభాగం దుగ్గిరాల మండల అధ్యక్షురాలు మాది నాగదుర్గ, ఆలా శివాజీ, ధనుంజయ్, ఉయ్యూరు రాజేశ్వరి, లక్ష్మి, మాది వెంకటేశ్వరరావు, డి.సునీత పాల్గొన్నారు.

ఫెడరేషన్ కప్‌లో సత్తాచాటిన షబీనా



విక్టరీ స్టాండ్‌పై అభివాదం చేస్తున్న షబీనా

తెనాలి: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పతకాలను సాధిస్తున్న షబీనా ఫెడరేషన్ కప్ పోటీల్లోనూ సత్తా చాటింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ నెల 27, 29 తేదీల్లో జరిగిన ఫెడరేషన్ కప్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన షేక్ షబీనా బంగారు పతకం సాధించింది. సబ్ జూనియర్ విభాగంలో 84కిలోల కేటగిరీ పోటీల్లో పాల్గొన్న షబీనా స్క్వాడ్‌లో 170 కిలోల బరువునెత్తి రజత పతకం, బెంచ్‌ప్రెస్‌లో 77.5కిలోల బరువుతో రజత పతకం, డెడ్ లిఫ్ట్‌లో 167.5కిలోల బరువును ఎత్తి బంగారు పతకం, ఓవరాల్‌గా 415 కిలోల బరువులతో బంగారు పతకం సాధించారు. మంగళగిరిలోని ఫిట్‌జోన్ జిమ్‌లో అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ షేక్ సందాని ఆధ్వర్యంలో సాధన చేస్తున్న షబీనా ఇప్పటికే పలు జాతీయ పోటీలతో సహా ఆసియా పోటీల్లోనూ పతకాలను సాధించిన విషయం తెలిసిందే. షబీనా విజయం పట్ల సౌత్ ఇండియా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి సకల కోటేశ్వరరావు, ఏపీ అసోసియేషన్ అధ్యక్షుడు మద్ది ప్రభాకర్, కార్యదర్శి సకల సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, సీనియర్ లిఫ్టర్ కొమ్మాల విజయభాస్కర్, సీనియర్ పవర్‌లిఫ్టర్లు బి.ప్రసాద్, గుమ్మడి వెంకటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

శబరిమలకు అయ్యప్ప మాలధారులు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడులో 40 రోజులుగా అయ్యప్పమాల ధరించి నిష్టతో పూజలు చేసిన అయ్యప్పలు శుక్రవారం శబరిమలకు బయలుదేరారు. ఉదయాన్నే అయ్యప్ప మాలదారులను గ్రామంలో ఊరేగించి జలపాలేశ్వరస్వామి ఆలయం వద్దకు తీసుకువచ్చారు. గురుస్వామి ఉమాపతిశాస్త్రి అయ్యప్ప పడి పూజలు చేసి మాలదారులకు ఇరుముడి తలపై ఉంచారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

తాడేపల్లిరూరల్: అదృశ్యమైన కందుల పిచ్చయ్య మృతదేహం శుక్రవారం గుర్తించారు. తాడేపల్లిపోలీసులు తెలిపిన వివరాలు.. మంగళగిరి పట్టణ పరిధిలో మైలార్ నగర్‌లో నివాసముండే కందుల పిచ్చయ్య(70) కనిపించడం లేదంటూ అతని కుమారుడు కందుల దుర్గారావు ఫిర్యాదు చేశాడు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రకాశం బ్యారేజ్ దిగువ ప్రాంతంలో యాప్రాన్ సమీపంలో ఉన్న నీటిలో మృతదేహం ఉందని సమాచారం రావడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పిచ్చయ్యగా గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.